క్లుప్తంగా

శివాలయానికి విరాళం

మధిర: మడుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత రాజరాజ నరేంద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో ఉత్సవ మండప నిర్మాణానికి గ్రామానికి చెందిన శీలం నాగభూషణ్ రెడ్డి జ్ఞాపకార్థం సతీమణి నారాయణమ్మ రూ.1.01.116 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ మండప నిర్మాణ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ఆలయ అర్చకులు దాములూరి సతీష్ శర్మ కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రతిభ

ఎర్రుపాలెం: ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ మండలి సోమవారం విడుదల చేసిన ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సర పరీక్షలు 90 మంది రాయగా.. 80 మంది పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 57మంది పరీక్షలు రాయగా.. 55మందిలు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన భోషిత్ రెడ్డి, మస్తాన్, అఖిల, రాజ్‌కుమార్ తదితరులను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

శశాంక్ ప్రతిభ..


పాగి శశాంక్

మధిరరూరల్: తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు సోమవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ బెటర్‌మెంట్, సప్లమెంటరీ పరీక్షా ఫలితాల్లో పాగి శశాంక్ 467 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. తొలిసారి వెలువడిన పరీక్షా ఫలితాల్లో 466 మార్కులు సాధించగా బెటర్‌మెంట్‌లో మరో మార్కు సాధించాడు. దీంతో శశాంక్‌ను పట్టణంలో పలువురు ప్రముఖులు అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించింది. ఈ మేరకు స్థానిక తహసీల్‌లో సోమవారం అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు రూ.32 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్‌క్లబ్ సభ్యులు


తల్లాడ పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఎస్సై కొండల్‌రావు, లయన్స్‌క్లబ్ సభ్యులు

తల్లాడ: తల్లాడ పోలీస్ స్టేషన్‌లో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై కొండల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ దారా శ్రీనివాసరావు, కార్యదర్శి నంబూరి కనకదుర్గ ప్రసాద్, బెల్లంకొండ ఆంజనేయులు, శీలం వెంకట్‌రెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సబ్ స్టేషన్‌లో పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా లంకపల్లి విద్యుత్‌శాఖ ఏఈ భుజంగరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గ వెంకటాపురం గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రాములు అనే రైతుకు చెందిన గేదె గ్రామ శివారులో వెంకటేశ్వర్‌రెడ్డి రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ పక్కన మేత మేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మరణించింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందనీ రైతు రాము తెలిపారు. వెటర్నరీ డాక్టర్ మమత సంఘటనా స్థలాన్ని పరిశీలించి గేదెకు పోస్టు మార్టం నిర్వహించారు.

శివాలయంలో అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలో వెంగళరావు నగర్‌లో గల భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి శివాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు జోన్నబోయిన బాలకృష్ణ, రమ్య దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రామడుగు గురుబ్రహ్మాచార్యులు, పద్మ, శ్రీనివాసరావు, బాబురావు, నరసింహచారి, శ్రీహరి, నానాజి పాల్గొన్నారు.

వేధిస్తున్న టీచర్ల కొరత

- ఏళ్లుగా భర్తీకానీ ఉపాధ్యాయ ఖాళీలు
- కుంటు పడుతున్న విద్యాబోధన
- ప్రమాదంలో విద్యావ్యవస్థ
- ఇంకా విద్యార్థులకు అందని యూనిఫాం


ఎర్రుపాలెంలోని ఎంఈఓ కార్యాలయం

ఎర్రుపాలెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ పాఠశాలలు మొత్తం 53 పాఠశాలలున్నాయి. పీఎస్, యూపీఎస్ పాఠశాలల్లో మొత్తం 113 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా అందులో 77 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 36 పోస్టులు గత కొన్ని సంవత్సరాలుగా భర్తీకి నోచుకోవడం లేదు. బదిలీల ప్రక్రియలో 8 సంవత్సరాలు నిండిన వారు మరో 28 మంది టీచర్లు వెళ్లనున్నారు. ఎర్రుపాలెం మండలం మైదాన ప్రాంతమైనప్పటికీ ఖమ్మం జిల్లా కేంద్రానికి బాగా దూరంగా ఉండటంతో బదిలీల సమయంలో కౌన్సిలింగ్‌లో ఎక్కువ మంది ఇక్కడకు రావడానికి విముఖత చూపుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ద్వారా తెలుస్తోంది.

ఖాళీగా దర్శనమిస్తున్న పోస్టులు..

ఉన్నత పాఠశాలల్లో మొత్తం పోస్టులు 99 మంది ఉండగా 52 మంది విధుల్లో ఉన్నారు. 45 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీ ప్రక్రియ కూడా పూర్తి అయ్యింది. ఇంకా కొత్తగా వచ్చే వారు లేరు. ప్రస్తుతం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు 212 మందికి గానూ పాఠశాలల్లో ఇప్పుడు మొత్తం 64 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎస్జీటీ టీచర్లు బదిలీల్లో ఇక్కడకు రాకపోతే మరో 28 పోస్టులు ఖాళీగా ఉంటాయి. దీన్ని బట్టి చూస్తే మొత్తం ప్రస్తుతం 81 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 28 ఎస్జీజీ పోస్టుల కూడా భర్తీ కాకపోతే 109 పోస్టులు ఖాళీగా ఉండే ప్రమాదముంది. జిల్లా ఉన్నతాధికారులు ఎస్జీజీ కౌన్సిలింగ్ ప్రక్రియ సమయంలో ఇక్కడ పోస్టులను నింపే యోచన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలో విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశముంది. పోస్టుల భర్తీ స్థానంలో కనీసం విద్యా వాలంటీర్లతో నైనా భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.


భీమవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల


టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్న విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు పంపిణీ కాని యూనిఫాం..

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గానూ కేవలం 30 పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రమే యూనిఫాం పంపిణీ చేసి.. మరో 24 పాఠశాలల విద్యార్థులకు ఇంకా పంపిణీ చేయలేదు. ఈసారి స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంను కుట్టించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. నూతనంగా ఈ విధానం ప్రవేశ పెట్టడంతో సంఘాల సభ్యులు కుట్టు మిషన్ల కొనుగోలు ఆలస్యం చేశారు. ఈ క్రమంలో ఇంకా విద్యార్థులకు సరిపడా యూనిఫాంను కుట్టించలేదు. కొన్ని పాఠశాలలకు యూనిఫాం ఇచ్చి మరి కొన్నింటికి ఇవ్వకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు వివక్షతకు గురవుతున్నారు. ఇప్పటికైనా యూనిఫాం పంపిణీలో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి..



పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను నియమించాలి. టీచర్ల కొరత ఉంటే విద్యార్థులకు ఎవరు పాఠాలు బోధిస్తారు. పాఠశాలలో 134 మంది విద్యార్థులకు గానూ.. పదిమంది టీచర్లు ఉండాలి.. కానీ ఇక్కడ ముగ్గురే ఉన్నారు. హిందీ, ఇంగ్లీష్, బయాలజీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులకు టీచర్లు లేరు. పోస్టుల భర్తీపై ప్రభుత్వం, విద్యాశాఖా శ్రద్ధ చూపాలి.

– పేరం మల్లేశ్వరరావు, పేరంట్, భీమవరం

టీచర్ల కొరత లేకుండా చూడాలి..



పాఠశాలల్లో టీచర్ల పోస్టులు సగం ఖాళీగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి ఉంటే విద్యార్థుల చదువులు ఆగమ్య గోచరంలో పడతాయి. ఇప్పటికే 212 పోస్టులకు గానూ 80కి పైగా ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. ప్రభుత్వం కనీసం ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేపట్టాలి. ఈ విషయంలో ఉన్నతాధికారులతో కూడా మాట్లాడతా.

– శీలం కవిత, జెడ్పీటీసీ, ఎర్రుపాలెం

ఉపాధ్యాయుల కొరత నిజమే..



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్న మాట వాస్తవమే. గత సంవత్సరం కూడా ఎంతో కష్టపడి విద్యార్థులకు చదువులు కొనసాగించాం. ఇప్పటి వరకు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాల్సిందిగా తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలతో బోధన కొనసాగిస్తాం.

– వై.ప్రభాకర్‌రావు, ఎంఈఓ, ఎర్రుపాలెం

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కృషి చేస్తా


మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

సత్తుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్ రావు అన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతతత్వ పార్టీ అని విమర్శించిన నాయకులకు ముచ్చెమటలు పట్టించేలా ప్రజలు కుల, మతాలకతీతంగా ఓట్లు వేశారన్నారు. అదే విధంగా పామ్ ఆయిల్ అసోసియేషన్‌తో చర్చలు జరిపామని త్వరలో వ్యవసాయశాఖ మంత్రిని కలిసి మట్లాడుతామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయం ఎక్కువగా ప్రొత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బయో యానిట్స్ ప్రారంభించాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతామన్నారు. స్థానిక సింగరేణి సమస్యను పరిష్కరించే దిశగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్తుపల్లికి తీసుకోవస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్యాం రాథోడ్, చావా కిరణ్, జొన్నలగడ్డ నరేష్, మట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం..


వేణు


మధిర: మధిర మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వేణును నియమిస్తూ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మధిర మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షఫీ ఉల్లా వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో వైరా మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ వేణుకు అదనపు ఇన్‌చార్జ్ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. ఆయన సోమవారం వెంటనే మధిర మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

బ్లాస్టింగ్ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

ముదిగొండ: మండలంలోని పండ్రేగుపల్లిలోని ఓ క్వారీ యజమాని చేసుకున్న దరఖాస్తును సోమవారం ఆర్డీఓ గణేష్ పరిశీలించారు. క్వారీల్లో బ్లాస్టింగ్ అనుమతులు కోసం ఖమ్మం సీపీకి దరఖాస్తు చేసుకోగా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జీ తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

పకడ్బందీగా ప్రీ స్కూల్ విద్య


శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సీడీపీఓ రత్తమ్మ

సత్తుపల్లిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను పకడ్బందీగా అమలుచేయాలని సత్తుపల్లి సీడీపీఓ రత్తమ్మ అన్నారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య ప్రీ స్కూల్ కార్యక్రమాలపై పునఃశ్చరణ తరగతులు ప్రారంభించారు. పుస్తకాల నిర్వహణ, పూర్వప్రాథమిక విద్యపై మాస్టర్ ట్రైనర్ కమల, సుజాత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రాజ్యలక్ష్మి, మల్లీశ్వరి, భవాని, సుజాత, మహాలక్ష్మి, రమాదేవి, రజిని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతువేదికలో..

ముదిగొండ: ముదిగొండలోని రైతువేదికలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముదిగొండలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో బాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని, నూతన విద్యావిధానాన్ని రూపొందించాలన్నారు.

వినతుల వెల్లువ..

ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలని..


తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

వేంసూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్ ఎంఏ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండు ఆదినారాయణ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో వేంసూరు మండలం ఎర్రగుంటపాటు యానాదులకు మొదటి దశలో మంజురు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లాల్ మహ్మద్, ఎస్‌కె రంజాన్, కిన్నెర మారయ్య, ఎస్‌కె హమీద్, శ్రీను, సుబ్బారావు, అంజమ్మ, రమేష్, సుజాత, పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకులను రెన్యువల్ చేయాలని ప్రిన్సిపాల్‌కు వినతి

కారేపల్లి: గెస్ట్ అధ్యాపకులను రెన్యువల్ చేయాలని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలానికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. తాము గత 8సంవత్సరాలుగా కళాశాలలో గెస్ట్ అధ్యాపకులుగా పని చేస్తున్నామని, ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరం ప్రారంభమైనా నేటికి ఇంటర్మీడియట్ కమిషనర్, అండ్ డైరెక్టర్ నుంచి రెన్యువల్ అనుమతులు రాలేదని, అయినా విద్యార్థులు నష్టపోకుండా వారికి విద్యాబోధన చేస్తున్నామని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణవేణి, యాకూబ్ పాషా, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించిన డొంక దారిని పునరుద్ధరించాలని..


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

బోనకల్: మండలంలోని రావపల్లి రెవెన్యూ పరిధిలోని జాలిముడి దిగువ భూముల్లో ఆక్రమించిన డొంక దారిని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం మండల సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ పున్నం చందర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సమితి సభ్యుడు పారుపల్లి నరసింహారావు మాట్లాడుతూ.. కొంతమంది రైతులు డొంక దారిని ఆక్రమించుకోవడంతో బ్రాహ్మణపల్లి రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన డొంక రోడ్డును తీయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి ఆనందరావు, పవన్ తదితరులున్నారు.

మతోన్మాదం దేశ ప్రయోజనాలకు నష్టం


మాట్లాడుతున్న సుబ్బారావు

చింతకాని: మతోన్మాదం దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టమని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు మన్నేపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాజకీయ శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత లౌకికతత్వ భారత రాజ్యాంగాన్ని మతతత్వ రాజ్యాంగంగా మార్చేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడిన అనేకమంది మేధావులు, జర్నలిస్టులను ఉపా చట్టం పేరుతో జైలుపాలు చేసిందని విమర్శించారు. వర్తమాన రాజకీయాలు, పరిస్థితులు అనే అంశంపై తరగతులు బోధించారు. ప్రతి కార్యకర్త సిద్ధాంతం పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా అకడమిక్ సెల్ కమిటీ సభ్యులు బోడపట్ల రవీందర్, మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు జానికిరాములు, వెంకటనర్సయ్య, కృష్ణమూర్తి, యజ్ఞనారాయణ, వీరబాబు, ఉపేందర్, కోటేశ్వరరావు, గోపయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ నెల చివరిలో బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి వారిస్థాయి అనుగుణంగా బోధన నిర్వహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సైదయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలా.. డంపింగ్ యార్డులా..?


వైరా రిజర్వాయర్ పంట కాల్వలు పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీరందించే పంట కాల్వలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులు వైరా రిజర్వాయర్ కింద పంట కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. వైరా మున్సిపాలిటీ చెత్త అంతా కాల్వలో వేస్తున్నారని అటు మున్సిపల్ అధికారులకు, ఇటు ఐబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే పంట కాల్వల్లో డంపింగ్ యార్డులు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సాంబశివరావు, గోవిందరావు, మధు, రాజశేఖరరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువే.. భవితకు వెలుగు


మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్: బాలికల పూర్తి చదువు దేశ భవితకు వెలుగు అని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం సీఆర్‌వై చైల్డ్‌రైట్స్ అండ్ యూ సహకారంతో ఎఫర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పూరికీ పడాయి దేశ్‌కి బలాయ్ అనే క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15నుంచి18సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి ఆడపిల్లలు తమ యొక్క చదువును పూర్తిగా, స్వేచ్ఛగా పూర్తి చేసుకునేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ నోడల్ అధికారి దామాల పుల్లయ్య, ఎస్సై మధుబాబు, స్పెషలాఫీసర్ కమల పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మనోహర్

తల్లాడ: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో సోమవారం వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. నీరు నిల్వ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి జ్వరాలు సోకే ప్రమాదముందన్నారు. ఇంటి పరిసరాలొంల పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, జాడీలు, సీసాలు, కూలర్లు, కుండలు, ఖాళీ డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కర్, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, మేరమ్మ, వసంత, భద్రమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నాయకులు

వైరా: రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ ఒకేసారి చేస్తామని క్యాబినెట్ భేటీలో ప్రకటించినందుకు గాను సోమవారం వైరాలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట జవదాటకుండా రైతులకు రుణమాఫీ అమలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని పాల్గొన్నారు.

హామీ నెరవేర్చా : ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చినహామీ మేరకు సత్తుపల్లి మండలం యాతాలకుంట సీతారామ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులకు రూ.10 కోట్లు మంజురు చేయించినట్లు ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ యాతాలకుంట గ్రామ భూ నిర్వాసితులు పరిహారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగిన రైతులకు ఎటువంటి న్యాయం జరగలేదని చెప్పారు. యతాలకుంట గ్రామ రైతుల సమస్యలు తెలుసుకున్న తాను వారికి ఇచ్చిన మాట ప్రకారమే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సుమారు 100 మంది రైతులకు రూ.10 కోట్లు మంజురు చేయించానని తెలిపారు.

ఆలయ భూములకు వేలం

వైరారూరల్: మండలంలోని విప్పలమడక గ్రామంలో ఉన్న శ్రీ సోమలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూముల్లో పంటల సాగు నిమిత్తం కౌలుదారులతో ఆలయ అధికారులు సోమవారం వేలంపాట నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్‌వీడీ ప్రసాద్ పర్యవేక్షణలో ఉద్యోగి ఎస్. శ్రీనివాసరావు ఈ వేలం పాటను నిర్వహించారు. ఆలయానికి సంబంధించి 12 ఎకరాల భూముల్లో వానాకాలం సేద్యానికి గానూ కౌలుదారులతో వేలం నిర్వహించగా లక్షకు పైగా ఆదాయం వచ్చింది. ఆలయ కమిటీ నిర్వాహకులు వీరపనేని చెన్నకేశవులు, రుద్రాక్షల వెంకటచారి, గోసు కృష్ణయ్య, మడుపల్లి నాగేశ్వరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు, గరికపాడు సొసైటీ డైరెక్టర్ దేవభక్తిని అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాబ్లాకు ప్రతిభా పురస్కార్ అవార్డు


పురస్కారం అందుకుంటున్న బాబ్లా

మధిర: యువ నాటికల రచన పోటీల్లో రంగస్థల కళాకారుడు, రచయిత మధిర బాబ్లాకు ప్రతిభా పురస్కార్ అవార్డు లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో గుంటూరు సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన నాటికల గ్రంథావిష్కరణ సభలో బాబ్లా రచించిన తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త అనే నాటిక పురస్కారానికి ఎంపికైంది. ఆచార్య అప్పాజోశ్యుల సత్యనారాయణ చేతుల మీదుగా బాబ్లాకు పురస్కారాన్ని, నగదు బహుమతి అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, శ్రీకృష్ణ ప్రసాద్, నాగేశ్వరరావు, సంక్రాంతి శ్రీనివాసరావు, జంగాల గురువులు, అంకురం శాస్త్రి, మేడేపల్లి శ్రీనివాసరావు, చేడె శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన రామాలయ స్వర్ణోత్సవాలు


శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. పణికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు పట్టాభిషేకం ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 7వేల మంది భక్తులకు అన్నదాత నిర్వహించారు. కార్యక్రమంలో చలసాని సాంభశివరావు, అనుముల సురేష్, కొత్తురు సత్యనారాయణ, తోట రమేష్‌బాబు, కొత్తురు ప్రభకర్‌రావు, గాంధీ, వెంకటేశ్వరరావు, రాజేష్, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, సురేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.